నమస్తే తెలంగాణ
సూర్యాపేట
5 | నల్లగొండ, మంగళవారం 6 ఫిబ్రవరి 2024 | SURYAPET

సూర్యాపేటలో సీఎం రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేస్తున్న బీఆర్ఎస్ శ్రేణులు

రేవంత్‌రెడ్డీ.. అనుచిత వ్యాఖ్యలు మానుకో..

- మాజీ సీఎం కేసీఆర్‌పై అడ్డగోలు మాటలు సరికావు
- బీఆర్ఎస్ అధినేతకు బహిరంగ క్షమాపణ చెప్పాలి
- ఏ ఒక్క హామీ అమలు చేయకున్నా ఊరుకునేది లేదు
- బీఆర్ఎస్ రాష్ట్ర కార్యదర్శి వై.వెంకటేశ్వర్లు
- సూర్యాపేటలో సీఎం రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మ దహనం

సూర్యాపేట టౌన్, ఫిబ్రవరి 5 : ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పొగరుబోతుతనం తగ్గించుకుంటే మంచిదని, బాధ్యతాయుతమైన పదవిలో ఉండి వీధి రౌడీలా ప్రవర్తిస్తున్న ఆయన తీరును ప్రజలు అసహ్యించుకుంటున్నారని బీఆర్ఎస్ రాష్ట్ర కార్యదర్శి వై.వెంకటేశ్వర్లు అన్నారు. తెలంగాణ జాతిపిత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌పై సీఎం రేవంత్‌రెడ్డి చేసిన అనుచిత వ్యాఖ్యలను నిరసిస్తూ సూర్యాపేట పట్టణంలోని తెలంగాణ తల్లి విగ్రహం వద్ద బీఆర్ఎస్ శ్రేణులు సోమవారం నిరసన తెలిపారు. అనంతరం ముఖ్యమంత్రి దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌పై సీఎం రేవంత్‌రెడ్డి అనుచిత వ్యాఖ్యలు చేసినందుకు యావత్ తెలంగాణ సిగ్గుపడుతుందన్నారు. కేసీఆర్ లేకుంటే తెలంగాణ రాష్ట్రం వచ్చేది కాదని, రేవంత్ ముఖ్యమంత్రి అయ్యేవాడు కాదని పేర్కొన్నారు. కేసీఆర్ కృషితో నేడు తెలంగాణలో కోట్ల టన్నుల ధాన్యం పండుతుందని, కాళేశ్వరం రూపుదిద్దుకొని సూర్యాపేట నియోజకవర్గంలోని చివరి గ్రామానికి కూడా నీరందుతుందని, లక్షలాది ఎకరాలు సాగవుతున్నాయని తెలిపారు. రైతుబంధు ఇవ్వలేదు, రుణమాఫీ చేయలేదు.. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం అమలు ఆర్టీసీపై మోపారని ఎద్దేవా చేశారు. చేతకాకుంటే ప్రజలకు క్షమాపణ చెప్పి తప్పుకోవాలని, తమ నాయకుడిపై అనుచిత వ్యాఖ్యలు చేస్తే ఊరుకునేది లేదని హెచ్చరించారు. ప్రజలు మీ నాటకాలను గమనిస్తున్నారని, రేవంత్‌రెడ్డి 420 అని, ఆయన అడ్డగోలు వ్యాఖ్యలు చూసి ప్రజలు నవ్వుకుంటున్నారని అన్నారు. ప్రభుత్వాన్ని కూల్చుతామని తమ పార్టీ నాయకులెవరూ అనలేదని, హామీలు అమలు చేయకుంటే నీ పీటం ఎక్కడ కదులుతుందోనని భయపడి మాట్లాడుతున్నావని పేర్కొన్నారు. ఇచ్చిన హామీలు అమలు చేయకుంటే ఊరుకునేది లేదని హెచ్చరించారు. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌కు బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ నిమ్మల శ్రీనివాస్‌గౌడ్, మున్సిపల్ వైస్ చైర్మన్ పుట్ట కిశోర్, కౌన్సిలర్ చింతలపాటి భరత్ మహజన్, బీఆర్ఎస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు సవరాల సత్యనారాయణ, ప్రధాన కార్యదర్శి బూర బాలసైదులు, నాయకులు లవకుశ, రమేశ్, జానీ, నాగయ్య, వేణుగౌడ్, రవి, అంజమ్మ, మహేశ్వరి, కరుణశ్రీ, విజయ, వేణుగోపాల్‌రెడ్డి, నరేందర్, రఫీ, కార్యకర్తలు పాల్గొన్నారు.

మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌పై అనుచిత వ్యాఖ్యలను నిరసిస్తూ భువనగిరిలోనూ బీఆర్ఎస్ నాయకులు సీఎం రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేశారు. కార్యక్రమంలో జడ్పీ చైర్మన్ ఎలిమినేటి సందీప్‌రెడ్డి, బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు కంచర్ల రామకృష్ణారెడ్డి, జడ్పీటీసీ బీరు మల్లయ్య, మున్సిపల్ మాజీ చైర్మన్ ఆంజనేయులు, నాయకులు పాల్గొన్నారు.

భువనగిరిలో సీఎం రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు, పాల్గొన్న జడ్పీ చైర్మన్ సందీప్‌రెడ్డి, పార్టీ జిల్లా అధ్యక్షుడు రామకృష్ణారెడ్డి

ఇష్టారాజ్యంగా స్ట్రాంగ్ రూమ్‌లోకి..

- ఐడీ కార్డులు లేకుండా, సెల్‌ఫోన్‌తో వెళ్లి ఈవీఎంల పరిశీలనకు

సూర్యాపేట, ఫిబ్రవరి 5 (నమస్తే తెలంగాణ) : పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా ప్రథమ స్థాయి పరిశీలన (ఎఫ్ఎల్‌సీ)లో నిర్లక్ష్యం కనిపించింది. నిబంధనల మేరకు స్ట్రాంగ్ రూంలోకి వెళ్లాలంటే స్ట్రాంగ్ రూం వద్ద ప్రత్యేక రికార్డులో పేరు నమోదు చేయాల్సి ఉంటుంది. అధికారులు, సిబ్బందితోపాటు ఆయా రాజకీయ పార్టీల నాయకులకు ప్రత్యేకంగా ముద్రించిన ఐడీ కార్డులు ఇస్తారు. వాటిని మెడలో వేసుకొని సెల్ ఫోన్లను బయటే ఉంచి లోపలికి వెళ్లాలి. కానీ.. సోమవారం సూర్యాపేటలో ఈవీఎంలు ఉంచిన స్ట్రాంగ్ రూమ్‌లోకి జిల్లా కలెక్టర్, నాయకులు వెళ్లే సమయంలో అధికార యంత్రాంగం నిబంధనలు గాలికి వదిలేసింది. ఒకరు మెడలో ఐడీ కార్డు లేకుండా, మరకొరు జేబులో సెల్‌ఫోన్‌తో లోపలికి వెళ్లారు. దీనిపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

స్ట్రాంగ్ రూమ్‌లో ఐడీ కార్డు లేని ఓ పార్టీ నాయకుడు, జేబులో సెల్ ఫోన్‌తో మరో నాయకుడు

అధికారుల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వీరేశం

14నుంచి చెర్వుగట్టు బ్రహ్మోత్సవాలు

- 21వరకు కార్యక్రమం
- అధికారుల సమావేశంలో ఎమ్మెల్యే వేముల వీరేశం

నార్కట్‌పల్లి, ఫిబ్రవరి 5 : ఈ నెల 14 నుంచి 21వరకు జరిగే చెర్వుగట్టు పార్వతీ జడల రామలింగేశ్వరస్వామి వార్షిక బ్రహ్మోత్సవాలను విజయవంతం చేయాలని నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం అధికారులకు సూచించారు. చెర్వుగట్టు గుట్టపై ఈఓ కార్యాలయం వద్ద జిల్లా అధికారులతో సోమవారం సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ తెలంగాణలో అతిపెద్ద శైవ క్షేత్రంగా పేరొందిన చెర్వుగట్టు రామలింగేశ్వర స్వామి కల్యాణానికి భక్తులు దూర ప్రాంతాల నుంచి వస్తున్నందున ఆ మేరకు వసతులు కల్పించాలన్నారు. గుట్ట కింద రోడ్డుకు ఇరువైపులా దూరంగా దుకాణ సముదాయాన్ని ఏర్పాటు చేసుకోవాలని పంచాయతీ సిబ్బందికి సూచించారు. ప్రభుత్వం మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పిస్తున్నందున సర్వీసులను అధిక సంఖ్యలో వేయాలని ఆర్టీసీ డిపో అధికారులకు సూచించారు.

డ్రైనేజీ, మంచినీటి సదుపాయాలు పూర్తిస్థాయిలో ఉండాలని, అధికారులు దేవాలయ సిబ్బందికి సహకరించాలని అన్నారు. స్వామివారి కల్యాణాన్ని తిలకించే భక్తులకు టికెట్లు విక్రయిస్తున్నందున తాను కూడా టికెట్ తీసుకొని కల్యాణంలో పాల్గొంటానని తెలిపారు. అంతకుముందు స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆర్డీఓ రవి శ్రీధర్‌రెడ్డి, ఇన్‌చార్జి ఈఓ నవీన్, తాసీల్దార్ పద్మ, ఎంపీడీఓ యాదగిరి, సంబంధిత అధికారులు, సర్పంచులు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

ఎంజీయూ పరీక్షల షెడ్యూల్ విడుదల

రామగిరి, ఫిబ్రవరి 5 : మహాత్మా గాంధీ యూనివర్సిటీ పరిధిలో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా బీఈడీ, బీపీఈడీ, ఎంపీఈడీ 3వ సెమిస్టర్, బీఈడీ స్పెషల్ ఎడ్యుకేషన్ సెమిస్టర్ 1, 2 పరీక్షల నిర్వహణ షెడ్యూల్ విడుదల చేసినట్లు వర్సిటీ సీఓఈ జి.ఉపేందర్ రెడ్డి తెలిపారు. పరీక్షల పూర్తి షెడ్యూల్‌ను వర్సిటీ వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచినట్లు పేర్కొన్నారు. ఆయా కళాశాలల ప్రిన్సిపాల్స్, అధ్యాపకులు విద్యార్థుల కు సమాచారం తెలియజేయాలని కోరారు.

గుత్తా ట్రస్ట్ ఆధ్వర్యంలో క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలు

నల్లగొండ, ఫిబ్రవరి 5 : గుత్తా వెంకట్‌రెడ్డి మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఫిబ్రవరి 6, 7 తేదీల్లో సియాన్ క్యాన్సర్ క్లినిక్స్ సౌజన్యంతో క్యాన్సర్‌పై ఉచితంగా పరీక్షలు నిర్వహిస్తారని ట్రస్ట్ చైర్మన్ గుత్తా అమిత్ రెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. అంతర్జాతీయ ప్రమాణాలతో రేడియేషన్ రహితంగా, అత్యంత గోప్యంగా మానవ స్పర్శ లేకుండా ఓరల్ క్యాన్సర్‌తోపాటు మహిళలకు బ్రెస్ట్ స్క్రీనింగ్ టెస్టులు చేస్తారని తెలిపారు. అలాగే క్లోవ్ డెంటల్ సౌజన్యంతో ఉచిత దంత పరీక్షలు కూడా నిర్వహిస్తారని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. ఈ ఉచిత క్యాంపు నల్లగొండ జిల్లా కేంద్రంలోని ఎన్జీ కాలనీలో శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి నివాసంలో ఉదయం పదిన్నర నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు నిర్వహించనున్నట్లు తెలిపారు. అదనపు వివరాలు కోసం 9542308396 నంబర్‌ను సంప్రదించాలని పేర్కొన్నారు.

సాగర్‌ను కేఆర్ఎంబీకి అప్పజెప్పి రైతుల నోట్లో మట్టికొడ్తరా..?

కేసీఆర్ వస్తుండు అనగానే కాంగ్రెసోళ్లకు లాగులు తడుస్తున్నాయి

- సీఎం రేవంత్, మంత్రి కోమటిరెడ్డి అహంకారంతో మాట్లాడుతున్నారు
- మాజీ మంత్రి, ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి
- తెలంగాణ ప్రజల ఆకాంక్షలు నెరవేర్చింది కేసీఆరే
- ఇచ్చిన హామీలను అమలు చేయక పోతే కాంగ్రెస్‌కు సమాధి తప్పదు
- పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ విజయం తథ్యం : మాజీ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి
- మిర్యాలగూడలో బీఆర్ఎస్ నియోజకవర్గ స్థాయి సమావేశం

సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి, ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డి, వేదికపై మాజీ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు భాస్కర్‌రావు, రవీంద్రకుమార్, భూపాల్‌రెడ్డి, విజయసింహారెడ్డి

మిర్యాలగూడ, ఫిబ్రవరి 10 : కాంగ్రెస్ నాయకులు దద్దమ్మలని, నాగార్జునసాగర్ ప్రాజెక్టు నిర్వహణను కృష్ణా రివర్ మేనేజ్‌మెంట్ బోర్డు (కేఆర్ఎంబీ)కు అప్పజెప్పడం వారి చేతగాని తనానికి నిదర్శనమని మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి అన్నారు. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ప్రజల్లోకి వస్తుండు అనగానే కాంగ్రెసోళ్ల లాగులు తడుస్తున్నాయని, ఆ అక్కసుతోనే రేవంత్‌రెడ్డి అహంకారంతో మాట్లాడుతున్నారని మండిపడ్డారు. మిర్యాలగూడ పట్టణంలోని టీఎన్ఆర్ గార్డెన్స్‌లో సోమవారం మిర్యాలగూడ నియోజకవర్గ స్థాయి బీఆర్ఎస్ ముఖ్య కార్యకర్తల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. దీనికి మాజీ మంత్రులు గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి, వేముల ప్రశాంత్‌రెడ్డితోపాటు మాజీ ఎమ్మెల్యే నల్లమోతు భాస్కర్‌రావు హాజరయ్యారు. ఈ సందర్భంగా గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి మాట్లాడుతూ కార్యకర్తలే పార్టీకి పునాది, పట్టుగొమ్మలన్నారు. 9 ఏండ్లు అయినా నదీ జలాల పంపిణీ చేసే తీరిక కేంద్రానికి లేకుండా పోయిందని, అలాంటి కేంద్రం పరిధిలోని కేఆర్ఎంబీ సాగర్ ప్రాజెక్టు నుంచి మనకు మంచి నీరు కావాలంటే తొందరగా ఇస్తదా అని ఆలోచన చేయాలన్నారు. ప్రాజెక్టును కేఆర్ఎంబీకి ఇవ్వడం అంటే ఆంధ్రాకు అప్పనంగా నీటిని రాసివ్వడమేనని తెలిపారు. అప్పట్లో చంద్రబాబు సాగర్ డ్యామ్‌పై హుషారు చేస్తే కేసీఆర్ ఆంధ్రా నాయకులు, పోలీసులను తరిమికొట్టారని గుర్తు చేశారు. బీఆర్ఎస్ హయాంలో వరుసగా 18 పంటలకు సాగునీరు ఇచ్చి అన్నదాతలకు అండగా నిలిచిన ఘనత కేసీఆర్‌కు దక్కిందని చెప్పారు. ఇప్పుడు కాంగ్రెస్‌సోళ్ల చేతిగాని తనం వల్ల సాగర్ డ్యామ్ మన చేతుల్లో నుంచి వెళ్లిపోయిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. యాదాద్రి పవర్ ప్లాంట్ ఆపుతా అని మంత్రి కోమటిరెడ్డి మతిస్థిమితం లేకుండా మాట్లాడుతున్నాడని, యాదాద్రి ప్రాజెక్టు పనులను ఆపితే ఆయనను ప్రజలే చెప్పులతో కొడుతారని హెచ్చరించారు. కాంగ్రెసోళ్లకు చిత్తశుద్ధి ఉంటే వెంటనే సాగర్ ప్రాజెక్టును మన పరిధిలోకి తీసుకురావాలని సవాల్ విసిరారు. తెలంగాణ రాష్ట్రానికి కేసీఆర్ శ్రీరామరక్ష అని తెలిపారు. సాగర్ నీళ్ల కోసం కేసీఆర్ పోరాటం మొదలుపెట్టనున్నారని, కాంగ్రెసోళ్లను ఉరికించి కొడుతామని అన్నారు. మన కండ్ల ముందే సాగర్ నీళ్లు పోతుంటే రైతుల కడుపు రగులుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. కాంగ్రెసోళ్ల నిర్వాకం వల్ల ఎడమ కాల్వ రైతాంగం మళ్లీ తిరోగమనం అయ్యేలా పరిస్థితి వచ్చిందని, సాగర్ డ్యామ్ కేంద్ర బలగాల చేతుల్లోకి పోయిందని చెప్పారు. ఇక యుద్ధం మొదలు పెట్టాల్సిందేనని, కాంగ్రెసోళ్లను తరిమికొట్టాల్సిందేనని బీఆర్ఎస్ శ్రేణులకు ఆయన పిలుపునిచ్చారు. రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థి గెలుపు కోసం కార్యకర్తలు కృషి చేయాలని కోరారు.

కాంగ్రెస్ గెలిచింది ధర్మపోరాటం వల్ల కాదు : మాజీ మంత్రి వేముల

ప్రజల ఆకాంక్షలను నెరవేర్చింది కేసీఆరేనని, తొమ్మిదిన్నరేండ్లలో ఎన్నో సంక్షేమ పథకాలను అందించి రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో తీసుకెళ్లారని మాజీ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి అన్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ ఓటమికి అనేక కారణాలు ఉన్నాయన్నారు. రాష్ట్ర అభివృద్ధిపై దృష్టి సారించడం వల్ల పార్టీ సంస్థాగత నిర్మాణంపై కొద్దిపాటి నిర్లక్ష్యం వల్ల ఎన్నికల్లో ఓటమి పాలయ్యామని తెలిపారు. ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ అనేక అబద్ధాలను ప్రచారం చేసిందని, ప్రజలు ఒకసారి అధికారం ఇద్దామని గెలిపించారు తప్ప ఆ పార్టీ ధర్మపోరాటం వల్ల కాదని చెప్పారు. అయినా కాంగ్రెస్ పార్టీ 1.8 శాతం స్వల్ప ఓట్ల తేడాతోనే గెలిచిందన్నారు. ముఖ్యమంత్రి అధికారిక నివాసం కోసం ప్రగతి భవన్ నిర్మిస్తే, ఇంటి లోపల బంగారంతో నిర్మించారని కాంగ్రెసోళ్లు ఆరోపించారని, ఇప్పుడు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అందులోనే ఉన్నారని బంగారంతో నిర్మించారా అని భట్టి విక్రమార్క సమాధానం చెప్పాలని అన్నారు. ప్రజలను నేరుగా కలుస్తా, ప్రజా దర్బార్‌లో సమస్యలను పరిష్కరిస్తానని చెప్పిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కేవలం ఒక్కరోజు మాత్రమే ప్రజా దర్బార్‌లో ప్రజలను కలిశారని ఆరోపించారు. కేసీఆర్ రాష్ట్రాన్ని అప్పుల పాలు చేశారని కాంగ్రెస్ నాయకులు ఆరోపించారని, నిబంధనలకు లోబడే అప్పులు తీసుకొచ్చి అభివృద్ధి చేశారని చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 50రోజుల్లోనే రూ.14వేల అప్పులు తీసుకొచ్చారని, దీనికి సీఎం రేవంత్‌రెడ్డి ఏమని సమాధానం చెప్తారని ప్రశ్నించారు. రైతు రుణమాఫీ, రైతు బంధు పేరిట అన్నదాతలను కాంగ్రెస్ పార్టీ మోసం చేసిందన్నారు. రైతుబంధు అడిగితే చెప్పుతో కొడ్తామన్న మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డికి ప్రజలే చెప్పులతో కొట్టే రోజులు దగ్గరపడ్డాయని చెప్పారు. మహాలక్ష్మి పథకం కింద మహిళలకు రూ.2,500 ఇవ్వడం లేదన్నారు. ఇచ్చిన హామీలు అమలు కావాలంటే కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తేనే సాధ్యమని సీఎం రేవంత్‌రెడ్డి ఇటీవల ప్రకటించడం దుర్మార్గమని తెలిపారు. హామీలను అమలు చేయడం చేతకాక కేసీఆర్‌ను, బీఆర్ఎస్ నాయకులపై సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రులు సహనం కోల్పోయి మాట్లాడుతున్నారని పేర్కొన్నారు. సాగర్ ఎడమ కాల్వకు నీటిని విడుదల చేసి పంటలను కాపాడాలని రైతులు జిల్లా మంత్రుల దృష్టికి తీసుకెళ్లగా 'పంటలను ఎవడు వేయమన్నాడ్రా మిమ్మల్ని' అని రైతులపై నోరు పారేసుకోవడం ఎంతవరకు సబబు అని ప్రశ్నించారు. ముఖ్యమంత్రి పదవిలో ఉన్న రేవంత్‌రెడ్డి భాష సరిగా లేదన్నారు. బీఆర్ఎస్ పార్టీని బొంద పెడ్తామని రేవంత్‌రెడ్డి అంటున్నాడని, ఇచ్చిన హామీలను అమలు చేయకపోతే ప్రజలే రాజకీయంగా సమాధి చేస్తారని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను బీఆర్ఎస్ కార్యకర్తలు ప్రజల్లోకి తీసుకెళ్లి రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థుల గెలుపు కోసం కృషి చేయాలని కోరారు.

రైతులకు అండగా నిలిచింది బీఆర్ఎస్ ప్రభుత్వమే : మాజీ ఎమ్మెల్యే నల్లమోతు భాస్కర్‌రావు

రాష్ట్రంలో రైతులకు అండగా నిలిచింది బీఆర్ఎస్ ప్రభుత్వమేనని, మాజీ సీఎం కేసీఆర్ పాలనలో అన్నదాతలు సంతోషంగా వ్యవసాయం చేసుకున్నారని మాజీ ఎమ్మెల్యే నల్లమోతు భాస్కర్‌రావు అన్నారు. కాంగ్రెస్ పాలనలో ప్రజలకు కష్టాలు ప్రారంభమయ్యాయన్నారు. గతంలో సాగర్ రిజర్వాయర్‌లో 515 అడుగుల నీటి మట్టం ఉన్నప్పటికీ పంటలు ఎండిపోకుండా నీటిని విడుదల చేసి కాపాడిన గొప్ప నాయకుడు కేసీఆర్ అని తెలిపారు. డ్యామ్‌లో 520 అడుగుల నీటి మట్టంతో 20 టీఎంసీల నీటి నిల్వ ఉండగా, 3 టీఎంసీల వరకు వాడుకునే అవకాశం ఉన్నా కాంగ్రెస్ ప్రభుత్వం పంటలను కాపాడలేకపోతుందని విమర్శించారు.

మిర్యాలగూడ నియోజకవర్గంలో 119 గ్రామ పంచాయతీల పరిధిలో, మిర్యాలగూడ మున్సిపాలిటీలో 90శాతానికి పైగా రోడ్లను నిర్మించామని, ఎన్నో అభివృద్ధి పనులు చేశామని తెలిపారు. బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు గుత్తా అమిత్‌రెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో విఫలం చెందిందని, దీన్ని బీఆర్ఎస్ కార్యకర్తలు అస్త్రాలుగా చేసుకొని ప్రజలను చైతన్య పర్చాలన్నారు. ఇది రైతు వ్యతిరేక ప్రభుత్వమని, ప్రజలు కాంగ్రెస్ పార్టీ నాయకులు చెప్పిన మాయమాటలను నమ్మి మోసపోయామని గ్రహించారని తెలిపారు. రాబోయే పార్లమెంట్, స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి గుణపాఠం చెప్పేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. మాజీ ఎమ్మెల్యే తిప్పన విజయసింహారెడ్డి, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు అలుగుబెల్లి అమరేందర్‌రెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో మాయ మాటలు చెప్పి ప్రజలను తప్పుదోవ పట్టించారన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ కోటిరెడ్డి, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు రమావత్ రవీంద్రకుమార్, మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ తిరునగరు భార్గవ్, నాయకులు నల్లమోతు సిద్ధార్థ, చింతరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, జొన్నలగడ్డ రంగారెడ్డి, అన్నభీమోజు నాగార్జునచారి, మోసిన్‌అలీ, దుర్గంపూడి నారాయణరెడ్డి, లలిత, హతీరాం, షహనాజ్‌బేగం, పాలుట్ల బాబయ్య, మట్టపల్లి సైదులు యాదవ్, షోయబ్ పాల్గొన్నారు.

సీఎం రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మ దహనం

సాగర్ ప్రాజెక్టును కేఆర్ఎంబీకి అప్పజెప్పి రైతులకు అన్యాయం చేసిన కాంగ్రెస్ ప్రభుత్వ వైఖరికి నిరసనగా మాజీ ఎమ్మెల్యే నల్లమోతు భాస్కర్‌రావు ఆధ్వర్యంలో బీఆర్ఎస్ శ్రేణులు మిర్యాలగూడలో సీఎం రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేశారు.

మిర్యాలగూడలో సమావేశానికి హాజరైన బీఆర్ఎస్ శ్రేణులు

నాగార్జునసాగర్ ప్రాజెక్టును కేఆర్ఎంబీకి అప్పజెప్పడాన్ని నిరసిస్తూ మిర్యాలగూడలో సీఎం రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేస్తున్న మాజీ ఎమ్మెల్యే భాస్కర్‌రావు, బీఆర్ఎస్ నాయకులు విజయసింహారెడ్డి, అమిత్‌రెడ్డి తదితరులు

ప్రత్యేక అధికారులు బాధ్యతగా పని చేయాలి

- మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి

నల్లగొండ, జనవరి 5 : గ్రామపంచాయతీ ప్రత్యేక అధికారులు బాధ్యతతో విధులు నిర్వహించాలని రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అన్నారు. కలెక్టరేట్‌లోని ఉదయాదిత్య భవన్‌లో సోమవారం గ్రామ పంచాయతీ ప్రత్యేక అధికారులకు గ్రామ పాలనపై నిర్వహించిన శిక్షణలో ఆయన మాట్లాడారు. గ్రామపంచాయతీ ప్రత్యేక అధికారులు ఎన్నికలు నిర్వహించే వరకు బాధ్యతలు నిర్వహించాలన్నారు. ఫిబ్రవరి, మార్చి నెలల్లో తాగునీటి సమస్య ఏర్పడే అవకాశం ఉన్నందున, పరిష్కారానికి ప్రాధాన్యమివ్వాలని ఆదేశించారు. ట్యాంకులు, పైప్‌లైన్ లీకేజీలు రిపేర్ చేయించాలన్నారు. తాగునీటి సమస్య పరిష్కారానికి ఎమ్మెల్యేలకు కేటాయించిన నిధుల నుంచి ఇస్తామని, ఇంకా ఏమైనా సమస్యలు ఉంటే కలెక్టర్ దృష్టికి తీసుకురావాలని మంత్రి సూచించారు. కలెక్టర్ హరిచందన మాట్లాడుతూ ఫిబ్రవరి 7 నుంచి 14వరకు గ్రామపంచాయతీల్లో ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. గ్రామపంచాయతీ ప్రత్యేక అధికారులు తమ విధుల పట్ల సంపూర్ణ అవగాహన కలిగి ఉండాలన్నారు. పంచాయతీల్లో నిధుల లభ్యత.. ఎంత ఖర్చు పెట్టారో పరిశీలించాలని, తాగు నీటి సమస్య పరిష్కారానికి అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని, ఇంటి పన్నులు, లే అవుట్ అనుమతులు, నాలా ట్యాక్స్ సక్రమంగా వసూలు చేయాలని సూచించారు. పరిశ్రమల కేంద్రం జనరల్ మేనేజర్ కోటేశ్వర్‌రావు మాట్లాడుతూ పీఎం విశ్వకర్మ పథకం ద్వారా 18 రకాల చేతి వృత్తులకు 5 శాతం వడ్డీతోరూ.లక్ష రుణం అందజేయనున్నట్లు తెలిపారు. 18 నెలల్లో తిరిగి చెల్లించాలన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, పక్కన ఎమ్మెల్సీ నర్సిరెడ్డి, కలెక్టర్ హరిచందన

సమావేశంలో అదనపు కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్, జడ్పీ సీఈఓ ప్రేమ్‌కరణ్‌రెడ్డి, డీపీఓ విష్ణువర్ధన్‌రెడ్డి పాల్గొన్నారు.

దివ్యాంగులకు అండగా ప్రభుత్వం

నల్లగొండ రూరల్ : దివ్యాంగులకు అండగా కాంగ్రెస్ ప్రభుత్వం పని చేస్తున్నదని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అన్నారు. అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం పురస్కరించుకొని మహిళా శిశు, వయోవృద్ధుల శాఖ అధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని మేకల అభినవ్ స్టేడియంలో నిర్వహించిన దివ్యాంగుల జిల్లా స్థాయి క్రీడా పోటీలను ఆయన ప్రారంభించి మాట్లాడారు. దివ్యాంగుల పట్ల మానవత్వంతో వ్యవహరించాలన్నారు. దివ్యాంగులకు ఆరు వేల పింఛన్ ఇచ్చేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. వివాహ ప్రోత్సాహకాలను త్వరగా విడుదల చేసేందుకు కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ నర్సిరెడ్డి, కలెక్టర్ హరిచందన, అదనపు కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్, జిల్లా మహిళా, శిశు సంక్షేమ శాఖ అధికారి కృష్ణవేణి, ఆర్డీఓ రవి, డీఈఓ భిక్షపతి, డీఎంహెచ్ఓ కొండల్‌రావు పాల్గొన్నారు.

ఒకేషనల్ స్కిల్ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్ ప్రాజెక్టు నిర్వహించాలి

జిల్లాలోని ఒకేషనల్ విద్యార్థుల కోసం స్కిల్ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్ ప్రాజెక్టు ఏర్పాటు చేయాలని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి కలెక్టర్ హరిచందనకు ఆదేశాలు జారీ చేశారు. ప్రతీక్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో కోమటిరెడ్డి ప్రతీక్ మెమోరియల్ బాలుర, ఒకేషనల్ జూనియర్ కళాశాలల విద్యార్థులకు సోమవారం ఫర్నిచర్, సామగ్రి, ల్యాబ్ పరికరాలు అందజేశారు. ఆయన వెంట డీఐఓ ఆర్.దస్రు, ఫౌండేషన్ చైర్మన్ ఎంవీ గోనా రెడ్డి, కళాశాల ప్రిన్సిపాల్స్ నరేందర్‌కుమార్, గోపాల్ రెడ్డి, ఎండీ ఇస్మాయిల్ ఉన్నారు.

విద్యార్థినుల మృతిపై విచారణ వేగవంతం చేయాలి

- జడ్పీ చైర్మన్ సందీప్‌రెడ్డి



భువనగిరిలో వసతి గృహం వార్డెన్‌తో మాట్లాడుతున్న జడ్పీచైర్మన్ సందీప్‌రెడ్డి, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు కంచర్ల రామకృష్ణారెడ్డి

భువనగిరి అర్బన్, ఫిబ్రవరి 5 : ఎస్సీ హాస్టల్ విద్యార్థినుల ఆత్మహత్యపై జ్యుడీషియల్ ఎంక్వైరీ వేసి విచారణ వేగవంతంగా, నిష్